క్లుప్తంగా

వితరణ



రూ. 5 వేలు వితరణగా అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు

డెంకాడ: టీబీ వ్యాధిగ్రస్తుల ఫుడ్ బాస్కెట్ కోసం జొన్నాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు రూ.5 వేలు వితరణగా అందించారు. జొన్నాడలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని మోపాడ టీబీ హెచ్‌ఎస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలన



అప్పన్నపేటలో ఎంపీడీఓ సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తొలగిస్తున్న సిబ్బంది

భోగాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవాం పరిశీలించామని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో ఉన్న తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. తాళాలు పగులగొట్టి పౌష్టికాహారం స్టాక్ ఎంతో ఉంది.. రికార్డులు సక్రమంగా ఉన్నయో, లేదోనని ఆరా తీశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు రామకృష్ణనాయుడు, రమణమ్మ, వీఆర్వోలు రామునాయుడు, కాశీ, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారుల బృందం

డెంకాడ: అత్యవసర పరిస్థితులు ఎదురైన సమయంలో ఎలా రక్షించుకోవాలన్న దానిపై జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శ్రీరాములు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్సై దాలయ్య, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని మలిచర్ల గ్రామంలో మూసిఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొసర నిర్మల శుక్రవారం తెరిపించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేపట్టిన నేపథ్యంలో అధికారులు కేంద్రాన్ని తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఆహార నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి. రమాకుమారి, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నీబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, కార్యాలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి..

విజయనగరం టౌన్: అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎత్తుబ్రిడ్జి సమీపంలో ఉన్న రివైవల్ టాబర్నికల్ చర్చి పాస్టర్ ఆంద్రు ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు జాస్మిన్, స్టీవెన్, షారోన్‌లు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

పొట్టి శ్రీరాముల జీవితం భావితరాలకు ఆదర్శం

• మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అమరజీవి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరుడైన గొప్పవ్యక్తి శ్రీరాములని కొనియాడారు. గాంధీ మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా అహింస, దళిత జనోద్ధారణకు జీవితాంతం ఎనలేని సేవలందించారన్నారు. శానిటరీ ఇంజినీరింగ్ కోర్సు చేసి రైల్వేశాఖలో ఉద్యోగం చేసినప్పటికీ దేశ ప్రజల పట్ల మక్కువతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నంతవరకు పొట్టి శ్రీరాములును స్మరించుకోవాల్సిన అవసరం ఆంధ్రులుగా మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నివాళులు..

అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శ్రీ అమరజీవి ఫౌండేషన్, అమరజీవి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు అలవెల్లి శేఖర్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రం సాధించడానికి 56 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం దారపోసిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. అటువంటి మహనీయుని వర్ధంతి సందర్భంగా ఉల్లివీధిలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, గుంపిన నారాయణరావు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, విజ్జపు శ్రీనివాసరావు, కె.కుమార్, మండవిల్లి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆలోచింపజేసిన 'సేఫ్ ఆన్ రోడ్' ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న చైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

విజయనగరం అర్బన్: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ పట్టణంలో శుక్రవారం జరిగిన 'సేఫ్ ఆన్ రోడ్' ర్యాలీ ఆలోచింపచేసింది. 'స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం'లో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 'రోడ్డు భద్రత' అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్డు రవాణా నిబంధనలు పాటించకపోతే కలిగే ప్రమాదాలు తెలియజేస్తూ నినాదాలు చేశారు. ర్యాలీని చైతన్య పాఠశాలల ప్రాంతీయ సంచాలకుడు వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డీన్లు సత్యనారాయణ, సూర్యచంద్ర, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ లేదు..

విజయనగరం రూరల్: వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడంలో రాజీ పడేది లేదని ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. కేశవరెడ్డి తెలిపారు. నగరంలో ఎస్ఆర్ వస్త్రాలయం ప్రారంభించనున్న నేపథ్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 17 ఏళ్లుగా వస్త్ర వ్యాపారంలో వినియోగదారులకు సేవలందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 బ్రాంచ్‌లు ఉన్నాయని.. విజయనగరంలో 13వ బ్రాంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా శనివారం కొత్త బ్రాంచ్ ప్రారంభిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి సినీతారలు పాయల్ రాజ్‌పుత్, నేహారెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ ఎస్.రామ్మోహన్ రెడ్డి, మార్కెటింగ్ ఏజీఎం రఘు, మేనేజర్ సూర్యకుమార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈడీ శివకేశవరెడ్డి

సంక్షేమ పథకాలతో మేలు..

డెంకాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందని జొన్నాడ సర్పంచ్ కోరాడ రమణి అన్నారు. మండలంలోని జొన్నాడలో వికసిత్‌భారత్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాల పీడీకి ఆడుదాం ఆంధ్రా క్రీడాకిట్లను అందజేస్తున్న సర్పంచ్ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు దేవి, తదితరులు

మహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమంలో దేవాలయ అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ భారతీయ తత్త్వ దర్శనకేంద్రం శ్రీక్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని వేద మంత్రాల నడుమ దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



భోగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతాంగానికి పెద్దపీట వేస్తూ, రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో సుందర హరీష్, కొయ్య బంగార్రాజు, ఊడికల గురువులు, బి.మాధవరావు, మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఉప తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, డీటీ మురళీ, రైతులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకే ..

పూసపాటిరేగ: దళారీ వ్యవస్థ నిర్మూలనకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని లంకలపల్లిపాలెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్రాలలో అత్యంత పారదర్శకంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పారు. గోనెలు, హమాలీ చార్జీలు, కొనుగోలు కేంద్రం సిబ్బంది వేతనాలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, మండల వ్యవసాయాధికారి కె.నీలిమ, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు రౌతు సాయికుమార్, పి. మహేష్, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: లంకలపల్లిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

బాలల కేసుల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

• యూత్ క్లబ్ డైరెక్టర్ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న యూత్ క్లబ్ డైరెక్టర్ ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: బాలల కేసులు పరిష్కరించడానికి ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసిందని యూత్ క్లబ్ (బెజ్జిపురం) డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో బాలలపై కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోందని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలలకు న్యాయం, హక్కుల పరిరక్షణ అనే అంశాలపై యూత్‌క్లబ్ సేవా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ అప్పలనాయుడు, కో ఆర్డినేటర్ ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మృతి తీరని లోటు..

విజయనగరం ఫూల్‌బాగ్: రాజమండ్రి జిల్లా ఉండిలో జరుగుతున్న అంగన్‌వాడీల ఉద్యమానికి సంఘీభావం తెలియజేసి తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ మృతి చెందడం ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్‌మోహనరావు, బి. పైడిరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ షేక్‌షాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, తదితరులు

పాడైన పంటను పరిశీలిస్తున్నాం..



డెంకాడ పొలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

• జిల్లా వ్యవసాయాధికారి రామారావు

డెంకాడ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు. మండలంలోని డెంకాడ గ్రామంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూన, 33 శాతం పైబడి పంట నష్టం వాటిల్లినా, పైరు నేలకొరిగినా పంటనష్టం కోసం నివేదికలు పంపిస్తామన్నారు. డెంకాడ గ్రామ పరిధిలో 40 ఎకరాల్లో వరి పంట పోయినట్లు గుర్తించామన్నారు. ధాన్యంలో 17 శాతానికి మించి తేమ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం డెంకాడ ఆర్‌బీకేను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ నిర్మల, వీఆర్‌ఓ ఎం.అప్పలరామస్వామినాయుడు, వ్యవసాశాఖ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

• సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్

విజయనగరం ఫోర్ట్: రక్తదానానికి యువత ముందుకు రావాలని సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి రక్తదానం చేయాలని సూచించారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కోలగట్ల ప్రతాప్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, అబ్దుల్ రవూఫ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువత

సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవాలకు సిద్ధం

విజయనగరం టౌన్: శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, స్వామి ఉపాసకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో షష్ఠి పంచరాత్ర పూజామహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 18న సుబ్రహ్మణ్య షష్ఠి, 20న ఉదయం 9 గంటలకు స్వామివారికి లక్ష పుష్పార్చన ఉంటుందన్నారు. 22 సాయంత్రం 4 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణ, కూర్మారావు, ఎస్. అచ్చిరెడ్డి, గోపాలకృష్ణ, డి.శ్రీనివాస్, వారణాశి సతీష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి, తదితరులు

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: చింతపల్లిలో లబ్ధిదారునకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతపల్లి-2 సచివాలయం పరిధిలో రెండో రోజు శుక్రవారం కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందచేసి రాష్ట్రంలో సంక్షేమ బావుటా ఎగురవేశారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజలు ముంగిటకే అందిస్తున్నారని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. నవరత్నాలు పథకాలు అమలు చేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రాబోయే ఎన్నికలలో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీర మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, సర్పంచ్ బర్రి మొసలి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, పబ్బిరెడ్డి. అప్పడుదొర, బర్రి దాసు, టి. సీతారాం, మహంతి లక్ష్మణరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏపీఎం పెంటంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి 'గడప గడపకు...'

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో ఈనెల 17వ తేదీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పునఃప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పట్టణంలో 5, 6, 10, 11 వార్డుల్లో ఇంకా కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. 17 నుంచి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు ఆయా వార్డుల్లో పర్యటించి సంక్షేమ పథకాల అమలుపై వివరిస్తారన్నారు.